www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 డిసెంబర్ 2023

సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా సచివాలయంలో నియమితులైన విద్యుత్ సహాయకులను సచివాలయాల ఉద్యోగులుగా గుర్తించాలని ఎపి గ్రామ వార్డ్ సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్‌శాఖ ఎడిఇ చాన్‌బాషా, ఎఇ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్ల ప్రొబెషన్ డిక్లరేషన్ జిఎస్‌డబ్ల్యూఎస్ ద్వారానే చేసి ఎస్‌ఆర్‌లు ప్రారంభించాలని అన్నారు. సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, గ్రామ వార్డు సచివాలయ జాబ్‌చార్ట్‌ను అనుసరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇహెచ్‌ఎస్ హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, ఇపిఎఫ్ కాకుండా సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే జిపిఎస్ అమలు పరచాలన్నారు. విద్యుత్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైల్వేకోడూరులో ప్లేట్లు, గరిటలతో శబ్దం చేస్తూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

పోరు ఆగదు

ప్లేట్లతో మోత మోగిస్తూ నిరసన
15వ రోజూ కొనసాగిన సమ్మె
పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం జిల్లా వ్యాపితంగా ప్లేట్లతో మోత మోగిస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

రాజంపేట : పేట్లతో మోత మోగిస్తూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

రాయచోటి టౌన్ : తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అంగన్వాడీ వర్కర్ల యూనియన్లు ప్రకటించాయి. మంగళవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ భాగ్యలక్ష్మి కోశాధికారి పి.బంగారుపాప స్థానిక ప్రభుత్వ జూనియర్ కలాశాల ఆవరణలో ప్లేట్లు చేత పట్టి గనగన మోగించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 15 రోజులకు చేరిందని, అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం నోరు మెదపలేదని పేర్కొన్నారు. గతంలో జరిగిన చర్చల్లో మినీ సెంటర్లను సెంటర్లుగా మారుస్తామని అంగీకరించారని, ఇప్పటి వరకు దీనికి సంబంధించిన జిఒ ఇవ్వలేదన్నారు. సమస్యలు పరిష్కరించకుండా సచివాలయ ఉద్యోగులతో కేంద్రాల తాళాలు పగలగొట్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ గ్రేడ్-2 సూపర్వైజర్ 560 పోస్టులు ఇచ్చామని మంత్రి ఉషశ్రీ చరణ్ అబద్ధాలు ఆడుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క పిల్లాడికి కూడా సరైన తిండి పెట్టలేక పోతుందన్నారు. ప్రభుత్వం అద్దెలు ఇవ్వకపోయినా గర్భిణులు, బాలింతలకు పోషణ అందిం చామన్నారు. లబ్ధిదారులకు ఇచ్చే ఆహారం నాసిరకంగా ఉందని, నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులతో ఖాళీ కంచాలు, గంటలు మోగిస్తామని తెలిపారు. 27న ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు ఇళ్లు, క్యాంపు కార్యాలయాలకు సామూహిక వినతిపత్రాలు అందిస్తామని అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే జనవరి నుంచి పోరాటాన్ని ఉదృతం చేస్తామని తెలిపారు. తమ ఆందోళనలకు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజలు విశాల మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయమ్మ సిద్దమ్మ నాగమణి అరుణ మస్రూన్ బీ సుమలత వనజ ప్రవీణ సబీనా రమీజా ఇందిరమ్మ పాల్గొన్నారు. **మదనపల్లి :** అంగన్వాడీ కార్మికులు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నుంచి ప్లేట్లు గెరిటలతో వాయిస్తూ(శబ్దం చేస్తూ) ర్యాలీగా వచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మధురవాణి ,రాజేశ్వరి మాట్లాడుతూ 15రోజులుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామని అందులో భాగంగా మంగళవారం తట్టా గెరిటలతో శబ్దం చేస్తూ ర్యాలీ గవచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశామన్నారు. కార్యక్రమంలో గౌరీ, కరుణ, స్వారూప, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఐసిడిఎస్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీగా వెళ్తూ పళ్లేలు మోగించి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శివరంజని, విజయమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారానికి15వ రోజుకు చేరింది. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు భోజనం ప్లేట్లు, గరిటలతో చప్పుడు చేస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు, మంజుల. అధ్యక్షురాలు ఎన్ రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధా కుమారి, మండల కార్యదర్శి జి పద్మ,, వెన్నెల, శిరీష, లీలావతి, ఈశ్వరమ్మ, మైథిలి, సునీత, నిర్మల, వాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్,ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి జాన్ ప్రసాద్, అంగన్వాడి వర్కర్స్ అసోసియేషన్ ఎఐటి యుసి జిల్లా కో-కన్వీనర్ సరోజ పాల్గొ న్నారు. **తంబళ్లపల్లె :** అంగన్వాడీ కార్యకర్తలు సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ ధర్నాను నిర్వహించారు. 15వ రోజు మంగళవారం అంగన్వాడీల సమ్మెలో భాగంగా తంబళ్లపల్లి బూదలవాండ్లపల్లి సమీపంలో మూడు రోడ్ల వద్ద సమ్మె నిర్వహించారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని అన్నారు. అంగన్వాడీల కోరికలు న్యాయమైనవని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, ప్రస్తుతం ఇస్తున్న జీతాలు సరిపోవడం లేదని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టడం చట్ట విరుద్ధమని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు స్వాధీనం చేసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రజలు స్వాధీనం చేసుకుంటే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. తక్షణం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలకు మద్దతుగా ప్రజలను కూడగట్టి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మెకు వెలుగు యానిమేటర్స్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు గౌరి, కరుణశ్రీ, సులోచన, స్వరూప, ప్రమీల, సరస్వతి, ఉమాదేవి, షరీఫా, విఓఏ యూనియన్ నాయకులు రెడ్డెప్ప, రాణి, రాజేశ్వరి లతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటిలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

లక్కిరెడ్డిపల్లెలో ప్లేట్లతో మోత మోగిస్తున్న అంగన్వాడీలు

మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు

పథకాలను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-వీరబల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరీష పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం వీరబల్లిలో జూనియర్ కళాశాలలో ఎంపిడిఒ మల్లేశ్వరి, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర మూడువేలమందితో మందితో నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ గిరీష, కేంద్ర ప్రభుత్వ కామర్స్ శాఖ అడిషనల్ సెక్రెటరీ, వికసిత్ భారత్ సంకల్పయాత్ర రాష్ట్ర నోడల్ అధికారి పీయూష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర అమలు చేస్తున్న సంక్షేమపథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతుల కోసం పిఎం కిసాన్ పథకం ఏర్పాటు చేసి ఏడాదికి రూ.6వేలు నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తున్న అన్నారు. నిరుపేదలకు జీవన్ భీమా ఎంతో ఉపయోగకరమని కేవలం 20 రూపాయలు కడితే చాలు అన్నారు వారికి బీమా వర్తిస్తుందన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కోసం ఐదు మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 248 గ్రామపంచాయతీలు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారులు నియమించినట్లు తెలిపారు. అనంతరం ఓధివీడు, తాటికుంటపల్లి, సర్పంచ్‌లు గోపీనాథ్‌రెడ్డిను దుశ్శాలువాతో సన్మానిం చారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా ప్రభారి అధికారి ప్రకాష్ ఖిచ్చి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి. వెంకటరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రజాసంఘాలతో కలసి ర్యాలీని ప్రారంభించి బస్టాండ్, వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా బంగ్లా చేరుకుని మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సమ్మెకు సిఐటియు అన్నమయ్య జిల్లా కమిటి నుంచి ముఖ్య ఆహ్వానితులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు సమస్యల పరిష్కారం చేయాలని ప్రభుత్వ పెద్దలకు అభ్యర్థించి, వినతులు సమర్పించారని చెప్పారు. విసిగి పోయిన కార్మికులు సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సందర్భంగా 'ఒక సంవత్సరం ఓపిక పట్టండి మన ప్రభుత్వం వచ్చిన 6 నెలల లోపే కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన- వేతనం చెల్లిస్తాం' అని చెప్పిన మాటను గాలికి వదిలేశారని అన్నారు. కార్మిక శాఖ ప్రతిపాదనల మేరకు జిఒ 30 ప్రకారం పంపు ఆపరేటర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్కర్స్ ,వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫీసు నిర్వహణ కార్మికులకు వేతనాలు పెంచుతామని మూడేళ్లుగా హామీలతోనే సరిపెడుతున్నారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు యస్. రామాంజనేయులు, ఒపిడిఆర్ రాష్ట్ర సహాయక కార్యదర్శి టి. ఈశ్వర్ లంబాడి హక్కుల సంఘంనాయకులు శంకర్ నాయక్ న్యాయవాది రాజులు మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారి సమ్మెకు మద్దతు ఇచ్చారు. మున్సిపల్ యూనియన్ నాయకులు చెన్నయ్య, రాంబాబు అగ్గిరామయ్య మాట్లాడుతూ 10-15 ఏళ్లుగా నైపుణ్యంతో కూడిన పనులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం దాగా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఫలితం శూన్యమని చెప్పారు. పట్టణాల విస్తీర్ణం, జనాభా పెరుగుదల దృష్ట్యా కార్మికులను పెంచడం లేదని విశ్వ విపత్తు కరోనా సందర్భంగా తీసుకున్న అదనపు సిబ్బందికి ఉద్యోగ భద్రత లేదన్నారు. సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామన్న హామీని విస్మరించారని మండి పడ్డారు. సమ్మెతోనైనా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. **రాజంపేట అర్బన్ :** మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరేవరకు పోరు ఆగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పురపాలక కార్మికులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతూ సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ ఓబయ్య, కార్మికులు రమణ, ప్రసాద్, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ కార్మికులు న్యాయపరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయం ఎదుట సిఐటియు అనుబంధ నగర పంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా లాక్ డౌన్ సమయంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పారిశుధ్య కార్మికులు ఎంతో కృషి చేశారన్నారు.ారికి ఎంత జీతం ఇచ్చిన తక్కువేనంటూ, వారికి ఉద్యోగం భద్రత కల్పిస్తూ జీతాలు పెంపు చేస్తామని తెలిపిన ముఖ్యమంత్రి ఇప్పుడు వారికి ఇచ్చిన హామీని మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ఇచ్చిన హామీలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మదనపల్లి సీనియర్ నాయకులు హరీందర్ శర్మ మాట్లాడుతూ నగర పంచాయతీ కార్మికులకు అలవెన్స్,ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు ఆవుల శ్రీనివాసులు,ఆవుల వెంకటరమణ, శివ, కేశవ శ్రీకాంత్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట పంచాయతీ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

సంపూర్ణ ఆరోగ్యం కోసమే క్రీడలు

అట్టహాసంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్ర'
కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో క్రీడలను ఒక భాగంగా అలవర్చుకొని ఆరోగ్య వంతులుగా జీవించాలని ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టారని కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ మైదానంలో ఆడుదాంఆంధ్ర క్రీడా పోటీలను కలెక్టర్, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వాలీబాల్ జాతీయ క్రీడాకారిణి, జిల్లా బ్రాండ్ అంబాసిడర్ వసుమతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలించారు. గాలిలోకి బెలూన్లను వదిలారు. శాంతికి చిహ్నంగా కపోతాలను ఎగురవేశారు. అనంతరం పాల్గొన్న క్రీడాకారులుచే ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చాలావరకు చదువుకునేటప్పుడు మాత్రమే క్రీడలలో పాల్గొని ఆ తర్వాత వాటిని మరిచిపోతామని అన్నారు. నేడు అలా కాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి ఉంచి శారీరిక ధారుఢ్యం మెరుగు పరుచుకోవాలని ఆడదాం ఆంధ్ర కార్యక్రమాలను చేపట్టామన్నారు. రాష్ట్రంలో చాలావరకు ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారందరినీ వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల మంది ఆడుదాం ఆంధ్ర లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. క్రీడా స్ఫూర్తితో జిల్లాకు ఎక్కువగా పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తెచ్చేందుకే ఆడుదాంఆంధ్ర కార్యక్రమానికి సిఎం జగన్ శ్రీకారం చుట్టారని అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను గ్రామ,వార్డు సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐదు దశల్లో 2.99 లక్షల మ్యాచ్‌లు, ఈవెంట్లు నిర్వహించను న్నారన్నారని తెలిపారు. 15 ఏళ్లు పైబడిన బాలబాలికలకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖోతో పాటు 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. అలాగే గ్రామీణ ప్రాం తాల్లో సాంప్రదాయ క్రీడల్లోనూ పోటీలను పెడుతున్నారన్నారు. ఇందులో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలో బాలబాలికలకు విడివిడిగా స్పోర్ట్స్ కిట్లను అందిస్తున్నారన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలకు నియో జకవర్గ స్థాయిలో తొలి స్థానంలో నిలిస్తే రూ.35 వేలు, జిల్లాస్థాయిలో రూ.60 వేలు, రాష్ట్రస్థాయి రూ.5 లక్షలు నగదు బహుమతి ఉందని తెలిపారు. కలెక్టర్ గిరీష పర్యవేక్షణలో పూర్తవుతున్న క్రికెట్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్భహించుకునేలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రంగస్వామి ,నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్, స్పోర్ట్స్ ప్రధాన కోచ్ గౌస్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఫయాజ్ అహమ్మద్, మదనమోహన్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, జాకీర్, గౌస్‌ఖాన్, రౌనక్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్నకలెక్టర్ గిరీష

నేడు యుటిఎఫ్ నిరసన దీక్ష

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి డివిజన్ స్థాయిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరసన దీక్షను పాత తాలూకా కేంద్రం వద్ద నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకులు సుధాకర్‌నాయుడు, పురం వెంకటరమణ, గాలిరవీంద్ర, సుధాకర్ సంయుక్త తెలిపారు. డివిజన్ స్థాయిలో ఉన్న జిల్లా నాయకులు డివిజన్‌లోని పది మండలాల యుటిఎఫ్ కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం డిప్యూటీ డిఇఒ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు.

గుండెపోటుతో ఎంఎన్ఒ మృతి

ప్రజాశక్తి - మదనపల్లి

మృతిచెందిన ఎంఎన్ఒ రామానుజులు

స్థానిక జిల్లా ఆస్పత్రి ఎంఎన్‌ఒగా పని చేస్తున్న రామానుజులు విధి నిర్వహణలో ఉండగా మంగళవారం సాయంత్రం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన వాల్మీకిపురానికి చెందిన వ్యక్తి. మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో ఎంఎన్‌ఒగా పనిచేస్తున్నారు. రోజు మాది రిగానే విధులకు హాజరైన ఆయన సాయంత్రం చాతిలో నొప్పి రావ డంతో కుప్పకూలిపోయారు. సిబ్బంది ఆస్పత్రి అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లారు. చికిత్సలు అందించేలోపే మృతి చెందారు. డాక్టర్లు సంతాపం వ్యక్తంచేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు

ఈశ్వరయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలి

రాయచోటి : లక్కిరెడ్డిపల్లె మండలంలోని దప్పేపల్లే గ్రామం గల్లావాండ్లపల్లెకు చెందిన దేరంగుల ఈశ్వరయ్య, అంజనమ్మ తమకు రక్షణ కల్పించాలని ఎస్‌పిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుడు దేరంగుల నాగరాజ, అదే గ్రామానికి చెందిన కొట్టే నవ్యను ప్రేమించి పెళ్లి చేసుకు న్నార న్నారు.. ఇరువురి కులాలు వేరు కావడంతో అమ్మాయి తల్లిదండ్రులు లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారని, పోలీసులు ప్రేమ జంటను ఈనెల 25న పోలీస్ స్టేషన్‌కు పిలిపించారని అన్నారు. తాము మేజర్ల మని తన ఇష్టప్రకారమే పెళ్లి చేసుకున్నానని నవ్య రాతపూర్వకంగా ఎస్ఐకు లేఖను రాసి ఇచ్చిందని తెలిపారు. అమ్మాయి తరుపు బంధువులు కులం పేరుతో దూషి స్తూ 'మా అమ్మా యిని అప్పగించకపోతే చంపేస్తామని, మీ ఇంటిని కూల్చేస్తాం' అని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. భయంతో ఎస్‌పిని కలిసి రక్షణ కల్పించాలని కోరామని అన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ మాట్లాడుతూ తమ ఉన్న రెండు వడ్డెర కుటుంబాలను ఊరు వదిలి వెళ్ళి పొమ్మని, ఇల్లు తగలబెడతామని బెదిరించడం తగదని అన్నారు. వారికి ఏదైనా జరిగితే అమ్మాయి తరపు వారు బాధ్యత వహించాలని, వీరికి పోలీసులు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర విద్యావంతుల వేదిక నాయకులు జీవానందం పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న బాధితులు

ప్రజాశక్తి
www.prajasakti.com

కలికిరి: టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు అందిస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

టిడిపిని ఆదరించండి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి హయాంలోని రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని, భవిష్యత్తు కోసం టిడిపిని ఆదరించాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తుకు భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మేడికుర్తి పంచాయతీ కూకటి గొల్లపల్లి, మజ్జిగ గొల్లపల్లి గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిడిపికి మరోమారు అవకాశం ఇస్తే రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మరింత అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తారని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జనార్దన్ గౌడ్, సీనియర్ నాయకుడు సూర్య ప్రతాప్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మినీ పోస్ట్‌ను వివరించినట్లు కలకడ టిడిపి ఇన్‌ఛార్జి జిలానీబాషా తెలిపారు. మంచి భవిష్యత్తు కోసం టిడిపిని ఆదరించినట్లు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ 56, 57,58,59 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటికి వెళ్ళి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమం గురించి తెలియజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 56వ వార్డు కన్వీనర్ ముబారక్‌అలీ 58వ వార్డు కన్వీనర్ ఖాజా హుస్సేన్, నాయకులు ఇర్ఫాన్ మహమ్మద్, మండలంలోని టిడిపి కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు. **ములకలచెరువు :** టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని తంబళ్లపల్లె టిడిపి ఇన్‌ఛార్జి శంకర్యాదవ్ పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో మండల తెదేపా కన్వీనర్ పాలగిరి సిద్ధ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శంకరాయాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీల కూటమి అభ్యర్థిని గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం నియోజకవర్గ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. తంబళ్లపల్లె అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చినన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో కక్ష రాజకీయాలు అధికం అయ్యాయన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందని, త్వరలో జరిగే ఎన్నికల్లో తెదేపా గెలుపుకు కార్యకర్తలు పట్టుకోమ్మల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, నియోజకవర్గ పరిశీలకులు గురువారెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ సాయినాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్రి, మండల తెదేపా కన్వీనర్లు పాలగిరి సిద్ధ, ఆనందరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, నాయకులు రమణ చెన్న క్రిష్ణ, వెంకటస్వామి, మౌలా, సుధాకర్నాయుడు, రామాంజులు, నాగమల్లప్ప, కట్టా హరి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి: 'యల్లటూరు'

ప్రజాశక్తి - నందలూరు

పవన్ కల్యాణ్ సారథ్యంలోని జనసేన పార్టీని నియోజకవర్గంలో బలపేతం చేయడం తమ లక్ష్యమని నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. మండల లోని పాటూరు, నాగిరెడ్డి పల్లె మేజర్ పంచాయతీల పరిధిలో గల ఎగువ కుమ్మరపల్లె,దిగువ కుమ్మర పల్లె, రాచపల్లె, ఇసుకపల్లి, దళితవాడలలో పర్యటించి రాబోవు ఎన్నికలలో జనసేన, టిడిపి కూటమికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29న అంగరంగ వైభవంగా జనసేన పార్టీ మండల కార్యాలయం ఆర్ఎస్ రోడ్డులో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, షబ్బీర్‌అహ్మద్, జనసేన నాయకులు ఆకుల చలపతి, సుబ్బరాజు, శ్రీనివాసరాజు, శంకర్ రాజు, గూడూరు శంకరయ్య, అమృత, పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ సురేష్ ప్రజలను హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాటా ్లడుతూ కలికిరి పోలీస్ స్టేషన్ ఎస్‌పి బి.కృష్ణరావు, రాయచోటి డిఎస్‌పి యస్.మహబూబ్‌బాషా ఉత్తర్వు మేరకు రాబోవు ఎన్నికల చేపట్టే రక్షణ చర్యలను వివరించారు. మండలంలో ఎవ్వరూ ఎలాంటి అసాంఘిక చర్యలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకి పాల్పడ కూడదని అన్నారు. ఇసుక అక్రమరవాణ జరపరాదని, పేకాట ఆడటం, కోడి పందేలు నిర్వహించడం, నాటుసారా తయారీ, అమ్మడం చేయ రాదని, బెల్ట్ షాపులు నిర్వహించి అమ్మకాలు జరపరాదని అన్నారు. రౌడీ షీటర్లు ఎలాంటి గొడవలు లేకుండా సత్ప్రవర్తనతో మెలగాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవ్వరైనా అనుమానితులు కానీ, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాలలో సంచరిస్తే తప్పకుండా పోలీసుల దృష్టికి తీసుకరావాలని సూచించారు.

సిఐ సురేష్

దేశభక్తులను స్మరించుకుందాం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

కార్గిల్ యుద్ధ పోరాటంలో చిన్నవయస్సులోనే ప్రాణత్యాగం చేసిన పరమవీరచక్ర విజయకాంత్ థాపర్, సర్దార్ ఉధమ్‌సింగ్‌ల జయంతిని వాకర్స్ ప్రతినిధి యస్.క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. బి.కొత్తకోట వాకర్స్ ప్రాంగణంలో వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో భాగంగా ఎంతోమంది తమ ప్రాణాలను అర్పించారన్నారు. అటువంటి మహనీయులను మనం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారి ఆశయ సాధన కోసం దేశ ప్రజలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాంబశివయ్య, నాగభూషణం, ప్రసాద్, వెంకటేశంపాల్గొన్నారు.

చిరంజీవి యువత ఉపాధ్యక్షులుగా గోపీకృష్ణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అఖిల భారత చిరంజీవి యువత వ్యవ స్థాపక అధ్యక్షులు రవణం స్వామినాయుడు ఆదేశాల మేరకు రాజంపేట నియోజకవర్గ చిరంజీవి యువత ఉపాధ్యక్షులుగా బిట్ర గోపీకృష్ణను నియ మిస్తూ కడప జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పంజ్రా రంజిత్ కుమార్ సహ కారంతో మంగళవారం రాజంపేట జనసేన పార్టీ క్యాంప్ కార్యాలయంలో జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ చేతుల మీదుగా రాజంపేట నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు గుగ్గిళ్ల నాగార్జున సమక్షంలో నియామక పత్రం అందించారు.



గోపీకృష్ణకు నియామక పత్రం అందిస్తున్న రంజిత్

వంగవీటి రంగాకు ఘన నివాళులు

పీలేరు : వంగవీటి మోహనరంగా 35వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక కడప రోడ్డులోని సంధ్య ప్రాథమిక చిత్రాలయంలో పీలేరు బలిజ సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోహన్‌రంగా పేదలను గుర్తుకు చేసుకుంటూ ఆయన కాపు, బలిజ సామాజిక వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రాణాలు అర్పించిన త్యాగశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పసుపులేటి లక్ష్మీకర్,హరీష్, అయ్యా శివ రాయల్, కల్పవల్లి, మల్లికార్జున సుద్దిమేపు గురుమూర్తి, బి.రామచంద్ర, న్యాయవాది చంద్రశేఖర్, సురేష్ బాబు, తాతయ్య, మెడికల్ షాప్ సుబ్బయ్య డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' అందరి ఆట :'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆడుదాం ఆంధ్ర అందరి ఆట అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఆడుదాం ఆంధ్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి క్రికెట్, వాలీబాల్, షటిల్, కబడ్డీ, పోటీలను ప్రారంభించారు. వారితో కలిసి పాటలు, ఆటలు ఆడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరిగే ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి రాష్ట్రవ్యాప్త క్రీడా మహోత్సవమని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించిన తర్వాత మన సమాజంలో జీవనశైలిలో రుగ్మతలు పెరుగుతున్నాయని గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు నివారించడానికి ఉత్తమ మార్గాల్లో ఒకటి వ్యాయామం, క్రీడల్లో పాల్గొనడం,ఈ క్రీడల పండుగ ద్వారా అట్టడుగు స్థాయి నుండి జీవనశైలి కొనసాగించి అలవాటును అమర్చుకోవాలని కోరారు. మహిళలు, బాలికలు క్రీడపై ఆసక్తిని పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎంపిడిఒ జాషువా, ఎపిబిడిసి డైరెక్టర్ మందల నాగేంద్ర,స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ సుబ్బరామరాజు, మండల కన్వీనర్ చెవ్వ శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ శివసాయి పాల్గొన్నారు. **కలకడ:** స్థానిక బాటవారిపల్లి జడ్‌పి హైస్కూల్లో బాటవారిపల్లి, బాలయ్యగారిపల్లి, కలకడ సచివాలయాలకు సంబంధించిన క్రికెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీదేవి రవికుమార్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ స్పోర్ట్స్ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన క్రీడా కారులను వెలికితీసే తీయడానికి ప్రవేశపెట్టారని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి నైపుణ్యాన్ని ప్రదర్శించుకోవడానికి ఒక మంచి వేదికగా దీని ఉపయోగించుకొని, ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రదీప్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, వైసిపి నాయకులు షౌకత్‌అలీఖాన్, సద్దాం, ఎం ఇఒలు మునీంద్రనాయక్, రామచంద్రరెడ్డి, ఇఒపిఆర్‌డి లతీఫ్‌ఖాన్, కలకడ, బాలయ్యగారిపల్లి, బాటవారిపల్లి, కార్యదర్శులు షబానా బాను, దేవేంద్ర,సచివాలయసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **గాలివీడు**: ఆడదాం ఆంధ్ర క్రీడలను గోపనపల్లి ఆరవీడు గ్రామంలో మండల స్పెషల్ ఆఫీసర్ శివయ్యప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేఖర్‌నాయక్, సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌కుమార్‌రెడ్డి కో-ఆప్షన్ మెంబర్, గ్రామ పెద్దలు, విద్యార్థులు, క్రీడాకారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండలంలో ఎంపిపి నరసింహులు ఆధ్వ ర్యంలో ఆడుదాం ఆంధ్ర క్రీడాలను అట్టహాసంగా ప్రారంభిం చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) క్రీడా మైదానంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల ప్రజా ప్రతినిధులతో, ప్రభుత్వ అధికారులతో కలసి పాల్గొన్నారు. ముందుగా డప్పు వాయిద్యాల మధ్య ప్రజా ప్రతినిధులకు అధికారులు స్వాగతం పలికారు. విద్యార్థుల చేత ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ఉన్న యువకులలోని క్రీడా ప్రతిభను వెలికి తీయ డానికి ఆడుదాం ఆంధ్ర బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి చలప తిరావు, ఎఇఒలు పద్మావతి, నారాయణ, హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్, పిఇటిలు భద్రయ్య, మనీ, ఉపాధ్యాయులు వెంకట గోపాల్, చంద్రాయుడు, శంకర, గంగాధర, రవి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యార్థులు, యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఊటుకూరు-2 ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఊటుకూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర పారంభించారు. కార్యక్రమంలో ఊటుకూరు సర్పంచ్ ఈశ్వరయ్య, సచివాలయ సిబ్బంది వెంకటయ్య, మణికంత, రాణి, బేబీ, సాయి పాల్గొన్నారు. **రామాపురం:** మండల పరిధిలోని సుద్దమళ్ళ గ్రామం, నల్లగుట్టపల్లి గ్రామంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీ పడేలా తీర్చిదిద్దడం, క్రీడా స్పూర్తిని పెంపొందించడం లక్ష్యంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు జరగనున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిజనార్దన్‌రెడ్డి, లక్కీరెడ్డిపల్లి మార్కెట్‌కమిటీ చేర్మెన్ కర్ణపు విశ్వనాథ్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు గోపాల్ రెడ్డి, భూషణ్ రెడ్డి, శ్రీధం రెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డి, నాగబశిరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని జడ్‌పిహైస్కూల్లో అనంతపల్లి క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, సీనియర్ వైసిపి నాయకులు కొల్లంగంగిరెడ్డిలు ప్రారంభించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలు ఉన్నటువంటి మన గ్రామాలలో ఉండే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించే గొప్ప కార్యక్రమమే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ నాగిరెడ్డి, హరినాథరెడ్డి, తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపిడిఒ రఘురాం, ఎస్ఐ రఘురాం, పంచాయతీ కార్యదర్శులు వేమయ్య, శివశంకర్, అశోక్ రెడ్డి, నాగేశ్వరరావు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఆడుడదాం ఆంధ్ర క్రీడలను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాల వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లా వైకాపా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ బ్యాటింగ్,నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పి.ఆర్.మనోహర్, ఎంపిడిఒ శంకరయ్య, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, వైసిపి పట్టణం కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, నాలుగో సచివాలయం కన్వీనర్ కంచి కల్యాణ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. **ఓబులవారిపల్లె :** మండల పరిధిలోని మంగంపేట ఎపిఆర్ఎస్ క్రీడ మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను చిత్తూరు జిల్లా జెసిఎన్, గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపిడిఒ విజయ రామారావు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు. **కలికిరి:** క్రీడలను అభివృద్ధి చేయడమే ఆడుదాం ఆంధ్ర ప్రధాన లక్ష్యమని ఎంపిడిఒ గంగయ్య అన్నారు. మండలంలోని కలికిరి మేజర్ పంచాయతీ రెడ్డివారిపల్లి లోని బాలురహై స్కూల్, పలవలి, మేడికుర్తి, మహల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజా, లోకవర్ధన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** గ్రామీణ ప్రాంత యువతకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వరంలాంటిదని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డయ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్‌అమీర్‌తో కలిసి ఎంపిపి సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ లు చక్రే నాయక్, వెంకటసుబ్బయ్యలతో పాటు ఉపాధ్యాయులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. **తంబళ్లపల్లె:** ఆటలతోనే మానసిక వికాసం దేహ ఆరోగ్యం చేకూరుతుందని స్పెషల్ ఆఫీసర్ జిల్లా అధికారి స్కందప్ప , విఆర్ఒ రాఘవేంద్ర, ఎంపిడిఒ సురేంద్రనాథ్‌లు తెలిపారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాలలో అడుగుదాం ఆంధ్ర ఆటల పోటీలను కన్యమడుగు ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్స్ స్కందప్ప, జడ్‌పి ఉన్నత పాఠశాలలో విఆర్ఓ రాఘవేంద్ర, ఎంపిడిఒ సురేంద్రనాథ్‌లు ప్రారంభించారు. మొదటిరోజు కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలను జరిగాయి. కార్యక్రమాలలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** స్థానిక మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర పోటీలను మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, ఎంపిడిఒ దివ్య, తహశీల్దారు శ్రీరాములనాయక్‌లు ప్రారంభించారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నజీర్ ముసల్ రెడ్డి, ఎంపిటిసిలు, ప్రిన్సిపల్ రమేష్, జెసిఎస్ కన్వీనర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

బి.కొత్తకోట: క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

సుందరం చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎల్ఐసి నాయకులు

ఎల్ఐసి యూనియన్ నేత సుందరం 6వ వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

35 సంవత్సరాల పాటు బీమా ఉద్యోగుల సంఘాన్ని, ఉద్యమాన్ని సమర్థంగా నడిపిన ఎన్.ఎం. సుందరం ఎన్నటికీ మరిచిపోలేని ప్రాతస్మరణీయుడని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్ అన్నారు. మంగళవారం ఉద్యోగుల యూనియన్ కార్యాలయ ఆవరణలో యూనియన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎల్ఐసిలో ఇదివరకు లేని పెన్షన్ సదుపాయం 1995లో అమలులోకి వచ్చిందని అన్నారు. దీనికి సుందరం దార్శనికత, ధీరత్వం, బ్యాంకింగ్ ఇతర రంగాలతో కలిపి నిర్వహించిన ఐక్య పోరాటాలే కారణమన్నారు. బీమారంగాన్ని ప్రవేటీకరించాలనే లక్ష్యంతో 1991లోనే ఆనాటి ప్రభుత్వం మల్హోత్రా కమిటీ సిఫారసులను ప్రకటించిందని, దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సదస్సులు, సెమినార్ల ద్వారా ప్రజలని కూడగట్టడం రూ. కోటి 50 లక్షలు సంతకాల సేకరణ, సమ్మెలు లాంటి కార్యక్రమాలు ఆయన నాయకత్వంలోనే జరిగాయన్నారు. ఐక్య కార్మికోద్యమాలే ఇందుకు మార్గమని ఆయన చూపిన బాటలోనే మనం నడవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, అమీనా పర్వీన్, వారిజాతమ్మ, అయ్యావారు రెడ్డి , నజీరుల్లా, పద్మజాలత, రాజు, కుమార్, జయచంద్ర, రఘు, ముడియం కిషోర్, చంద్ర, నరసయ్య, ఎల్లయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో ఈ నెల 28, 29న రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు డిఇఒ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ కన్వీనర్లు, సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 జిల్లాల నుంచి 78 వ్యక్తిగత ప్రదర్శనలు, గ్రూపు ప్రదర్శనలు, ఉపాధ్యాయుల విభాగం నుంచి 78 వస్తాయని పేర్కొన్నారు. వచ్చిన వారికి వసతి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సైన్స్‌ఫెయిర్ విజయవంతానికి సమిష్టి కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ నారాయణ, వెంకట్రామిరెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి యువత భవిత కావాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజ అభివృద్ధికి యువత భవిత కావాలని డిఆర్‌డిఎ పిడి ఆనంద్ నాయక్ పిలుపు నిచ్చారు. మంగళవారం డివైఎఫ్ఐ ముద్రించిన 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్, ఉపాధ్యక్షులు నరసింహులు, నగర అధ్యక్షులు షాకీర్ పాల్గొన్నారు.

అదనంగా స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు పట్టణం అంకాలమ్మ గుడి దగ్గర ఉన్న హిందూ శ్మశాన వాటికకు అదనపు స్థలం కేటాయించాలంటూ రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవి రమణ కోరారు. ఆ మేరకు మంగళవారం మున్సిపాలిటీ మేనే జర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ స్థానిక హిందూ శ్మశాన వాటిక పూర్తిస్థాయిలో సమాధులతో నిండిపోయి, మృత దేహాలను పూడ్చడానికి కష్టంగా ఉందన్నారు. మైదుకూరు గ్రామం నుండి పట్టణ స్థాయిగా పెరగడంతో జనాభాకు అనుగుణంగా శ్మశాన వాటికకు స్థలం కేటా యించాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో అక్రమణుకు గురైన శ్మశా న వాటికలను సర్వే చేయించి ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి నాయకులు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పెండ్లిమర్రి మండలం గొందిపల్లి వాస్తవ్యులు మాచవరం రామచెన్నారెడ్డి, ఆయన భార్య రామసుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు రామాంజనేయరెడ్డి, కోడలు రాజేశ్వరమ్మ మంగళవారం రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం అందజేశారు. శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి అలవలపాటి ముకుంద రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి పాల్గొన్నారు. లీవ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.సుదర్శన్ బాబు, మేంద్రగుత్తి గంగరాజు, కార్యదర్శులు కట్టా గంగాధర్, జయరాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు వితరణ

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్టలోని క్రీస్తు సంఘం చర్చిలో క్రిస్మస్, బాక్సింగ్ డేను పురస్కరించుకొని మంగళవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో చర్చి ఫాదర్ ఏసోబు, ఆయన సతీమణి రాణి 30 మంది విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు క్షేమంగా ఉండాలని ప్రార్థనలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, సేవకుడు జనార్ధన్‌రెడ్డి, సంఘ కార్యవర్గ సభ్యులు వెంకటసుబ్బయ్య, సునీల్, వినయ్, రాజు, డేవిడ్, రమేష్ పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

అక్రమ తవ్వకాలు ఆపాలని తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి నాయకులు కొండలపై అక్రమ తవ్వకాలు జరుపుతూ దోపిడికి పాల్పడుతన్నారని, ఈ దోపిడీని వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జనసేనపార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ తహశీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డికు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం లో కొందరు పెద్దలు అక్రమంగా కొండలు తవ్వి గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారని, ఇసుక రీచ్‌లలోనూ రోడ్డు నిర్మాణాల కోసము కొండలను, గుట్టలను యధేచ్ఛగా తవ్వేస్తున్నారని ఆరోపించారు. అక్రమాలను అడ్డుకోకుండా అధికారులు చూస్తూ ఊరుకోవడం శోచనీయమన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పక్కన పెట్టి దోచుకోవడం, దాచుకోవడమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ప్రభుత్వ అక్రమాలు, దౌర్జ న్యాలు వెంటనే ఆపివేయాలని, దీనిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యూహం సినిమాను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దర్శకుడు రాంగోపాల్‌వర్మ తీసిన వ్యూహం సినిమాను అడ్డుకుంటామని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలిశివకుమార్ అన్నారు. పట్టణంలోని పార్లమెంటు క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యూహం సినిమాలో రాజకీయంగా అభ్యంతర సన్ని వేశాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌జివి వంటి నీతిమాలిన వ్యక్తికి వైసిపి వంత పాడుతోందన్నారు. ఓ సైకో సిఎంకు మద్ధతుగా ఇంకో సైకో దర్శ కుడు సినిమా తీశారని ఏద్దేవా చేశారు. వ్యూహం సినిమాలో చంద్రబాబు, లోకేష్, పవన్‌లను కించపరిచే విధంగా సన్నివేశాలను చిత్రీకరించారి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరున్న చంద్రబాబు లాంటి విజనరీ నాయకుడి మీద ఇలాంటి తప్పుడు సందేశాన్నిచ్చే సినిమా తీయడం నీతిమాలిన చర్యని మండి పడ్డారు. వ్యూహం సినిమాను ఆపకపోతే వర్మ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ కుమ్మరిపల్లెకు వెళ్లే దారిలో వెలసిన శ్రీసాయినాధుని సన్నిధిలో మంగళవారం భక్తులకు, పేదలకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కటారు మునీంద్ర వర్ధంతిపురస్కరించుకొని కటారు సుబ్బరాయుడు, తులసమ్మ, కుమారి, కావేరిపాకు సురేష్‌బాబుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బద్రి బాబు, ఎపిఎం వసుం ధర, సునీత, శ్రీనికేష్, జోషిక, బాబు, అరుణ, పవన్, నట్వా వినయ్ కుమార్, సాయి, సుమంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర వేలం పాట రూ.21.34లక్షలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మార్చి 12, 13, 14 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతర వేలంపాట రూ.21.34 లక్షలు జరిగింది. ఈ వేలంపాటలో తలనీలాలు, టోల్ గేట్, కొబ్బరికాయలు, పూలదండలు సంబంధించి వేలంపాట నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.3.90 లక్షలు పెరిగిందని ఆలయ కార్య నిర్వహణ కార్యదర్శి రవీంద్రరాజు తెలిపారు. ఈ వేలంపాట దేవాలయ ధర్మదాయశాఖ పర్యవేక్షణ అధికారి జనార్ధన్, సర్పంచ్‌లు వెంకటనారాయణరెడ్డి, గడ్డం ప్రభాకర్‌రెడ్డి, చైర్మన్ నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. వేలపాట దక్కించుకున్న వారు వెంటనే డబ్బులు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు సుబ్బరాయుడు, సుబ్బయ్య, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, శేఖర్ పాల్గొన్నారు.

మోటార్ బైక్‌పై విన్యాసాలొద్దు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాబోవు నూతన సంవత్సర రోజున యువత తమ మోటార్ బైక్‌పై విన్యాసాలు చేసి ప్రమాదాలకు గురికా వద్దని ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ కె. గోపీనాథ్ అన్నారు. రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరిముల్లా ముద్రించిన ట్రాఫిక్ నిబంధనలు కరపత్రాలను మంగళవారం డాక్టర్ గోపీనాథ్ చేతుల మీదుగా పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు విశ్రాంత ఎల్ఐసి అధికారి. రఘునాథ్, ఉమామహేశ్వరరావు, శంకర్ నారాయణ, ముని, రామచంద్రరావు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

సామాజిక న్యాయం అంటే ఏమిటో చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని ఆప్కాస్ స్టేట్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బలిజలకు జగనే సిఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 1978 నుంచి పిసిసి ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు బలిజ సామాజిక వర్గ నాయకుడు వంగవీటి మోహన్‌రంగాను ప్రోత్సహించి విజయవాడ ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. 2004లో అధికారంలో వచ్చాక బలిజ, కాపు సామాజిక వర్గానికి చెందిన ఎంతోమంది నాయకులకు ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఇచ్చారన్నారు. 2019లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గడిచిన నాలుగున్నర సంవత్సరంలో దాదాపు పదిమంది బలిజ కాపు సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలను చేశారు. కార్యక్రమంలో బలిజ నాయకులు వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, గానుగపెంట సర్పంచ్ వీరభద్రుడు, రాళ్లపల్లి నరసింహులు, భూతప్ప, మద్దిలేటి, బండి వెంకటసుబ్బయ్య, మనోహర్ పాల్గొన్నారు.

బలిజలకు వైసిపిలో సముచిత స్థానం

ప్రజాశక్తి - కడప అర్బన్

బలిజ, కాపు సామాజిక వర్గానికి వైసిపి సముచిత స్థానం కల్పించిందని రాయలసీమ బలిజ సక్షేమ ఐక్య పోరాట సమితి రాయలసీమ అధ్యక్షులు ఎస్.వి.రాము అన్నారు. మంగళవారం సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపికి మద్దతు ఇవ్వం, ఓట్లు వేయమని జలిజ సంఘం తీర్మానించిందని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రకటనలు బలిజలను అవమానించడమే అన్నారు. సంఘం పేరుతో పత్రికలకు ఇవ్వడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సరికాదని చెప్పారు. బలిజల మనోభావాలు దెబ్బతీసే హక్కు ఎవరికి లేదన్నారు. కడప ఎంపి అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు బలిజలకు ఏ సహాయం కావాలన్న స్పందిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి రఘు, కార్యదర్శులు ఎం.సాంబశివయ్య, బి.శ్రీను పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఇంజిన్ కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

రైలు ఇంజన్ కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కదిరి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైల్వే గేట్ సమీపంలో ధర్మవరం నుంచి తిరుపతి వైపు వెళ్తున్న రైలు ఇంజిన్ కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కదిరి రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి వివరాలపై ఆరా తీసేందుకు ప్రయత్నించగా ఎటు వంటి ఆధారాలు లభించలేదు. మృతుడు సుమారు 40 సంవత్సరాల కలిగి ఉంటాడని, తెలుపు రంగు షర్ట్, నల్ల రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కదిరి రైల్వే ఎఎస్ఐ శివరెడ్డి, సిఅర్‌పి హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.